# ముసుగులు

కళ్యాణ చక్రవర్తి



"అమ్మాయి కింకా పెళ్ళి ప్రయత్నాలేమీ మొదలు పెట్టినట్టు లేదే!!"— అంటూ నా వైపు చూశాడు షడ్రసోపేత భోజనం చేసి, కిళ్ళీ దట్టించి, గోల్డుఫ్లేక్ సిగరెట్ ముట్టిస్తూ నాగేంద్రరావు.

నాకు తెలుసు, నన్ను దెప్పి పొడుస్తున్నాడని; అందుకే అన్నా వినయంగా, "యింకా సరియైన సంబంధం దొరకలేదండీ," అని.

ఈ ఊరికి ఇన్స్పెక్షన్ కొచ్చాడంటే నా కనుమానమే, ఎన్నో కేసులు లేందే రాడని. రాత్రే ఓ కేసు పట్టాడు. పెద్దదే లెండి. ఓ ఎనిమిది - ముట్టింది. ఇప్పటిదెంతో మరి! ఆయన తొందర అర్థవంతమే, పాపం! ఇది పూర్తి చేసుకొని వెంటనే 9 గంటల ఎక్స్ప్రెస్‌లో పడాలి. సాయంత్ర మక్కడ యింకెన్ని పనులో! పెళ్ళి సంబంధాలు, ఉద్యోగ విషయాలు, ఇన్సూరెన్సు గొడవలు- ఎన్ని వ్యాపారాలు వెలగబెట్టండే- అంతటి పలుకుబడీ - అంతస్థూ సంపాదించగలడు మరి.

"మా వాడొకడున్నాడు, డాక్టరు. పన్నెండు చాలు. ఏం, మాట్లాడమంటావా?" నా ముఖంలోకి చూస్తూ అన్నాడు.

చేతులు నులుముకొంటూ (అలవాటే లెండి), "ఏదో మీ దయవల్ల ఓ చల్లటిది కుదిరితే, ఆ పైన దానదృష్టం!" అన్నాను నిట్టూరుస్తూ—'సరియైన' అన్న పదానికి అర్థం తెలియని నాగేంద్రరావుని చూసి జారి పడుతూ.

"అదిసరే! ఏడీ, యీ సీతారామయ్య యెంతకీ రాడేం?"....విసుగ్గా ముఖంపెట్టా అన్నాడు-అదేదో నా తప్పైనట్టు. నేను ముభావంగా ఊరుకుండి పోయాను.

"నమస్కారమండీ!" కళ్ళజోడు సవరించుకొంటూ, దూసుకొంటూవచ్చి నిలబడ్డాడు సీతారామయ్య నాగేంద్రరావు కేసి చూస్తూ. ప్రక్కన గల నా ఉనికినైనా గుర్తింప నివ్వదు నాగేంద్రరావు యొక్క అస్థిత్వం!

అది మా యిద్దరి హోదాల వ్యత్యాసాన్నిబట్టి పూర్తిగా కాదుగానీ, పలుకుబడుల తేడాబట్టే అని చెప్పవచ్చు. ఐనా

పని ఆయన్తోగాని, నాతో కాదుగా. సమాధాన పరచుకొని కూర్చున్నా!

"ఆ! అబ్బాయిని తీసుకొచ్చినట్టు లేదే? పోనీండి. పైపు మిషన్‌చూసి భయపడకండా ఉంటే చాలు, నే చూసుకుంటాగా ఆ పోస్టు సంగతి—" సన్నగా పళ్లు నొక్కి-పట్టగా, నవ్వుతూ వెలువడ్డాయి మాటలు! మహానుభావులు, ఆ దర్పం, దర్జా-వారికే చెల్లుతాయి మరి. చిన్న కట్టలు కొన్ని చేతులు మారడం చూసీ చూడనట్టున్నా. మరేం చెయ్యాను? చూసినట్టుండ కూడదు. చూడకండా ఉండడానికి ప్రయత్నిస్తూన్నట్టు కన్పించనూ కూడదు.

"ఆ పోస్టేదో, కొంచెం యీ పూళ్ళోనే చూశారంటే, మీపేరు చెప్పుకునే బ్రతుకుతాం!—" వినయంగా, నసిగాడు సీతారామయ్య.

నా గుండె గుబేలుమంది. ఇంతకీ యీయనగారి సుపుత్రుడు, యీ వూళ్ళోనే ఉద్యోగం వేయించు కున్నాడంటే—సరాసరి నా నెత్తినే ఎక్కబోతున్నాడన్నమాట!

నోరు మెదపబోయి—నాగేంద్రరావు మొఖం కొంచెె యిబ్బందిగా మారడం చూసి—ఆగిపోయా. "అది కొంచెం కష్టమేనే! వెదవది, ఒకటి, రెండు మొండి ఘటాలడ్డు తగుల్తాయి" [వాళ్ళ చేతులూ తడపాలేమో, పాపం!]

"ఆ! తమరు తలుచుకుంటే, ఒకళ్ళని వంచడమెంత సార్! ఏదో-పిల్లలున్నవాణ్ణి-మీరే దయ చూడాలి!"-మరి కొంత యిచ్చుకొని, నీళ్ళు నములుతూ నించున్నాడు సీతారామయ్య.

"సర్లెండి, అలాగే చూద్దాం!—" అంటూ లేవాడు నాగేంద్రం. లేస్తున్నప్పుడు, కుర్చీ హాయిగా ఊపిరి పీల్చినట్టు ఊగింది. ఇక పనయిపోయిందని-నాగరికంగా చెప్పడమన్నమాట-అది! నేను తేరుకున్నాను-"సుబ్బన్నా! టాక్సీ పిలుచుకొచ్చి అయ్యగారి సామాను పెట్టించు!" హుకుం జారీ చేశాను!

## 2

స్టేషన్ ముందు టాక్సీ ఆగగానే.... పర్సుతీసి ఓ పెద్ద నోటు లాగబోయాను. [ఆఁ, ఎలాగూ చిల్లర దొరకదుగా!].

"అహ! ఎందుకు లెండి, చిల్లర నా దగ్గరుంది!-"అంటూ ఓ ఐదు రూపాయల నోటు విలాసంగా అందించినట్టు విసిరాడు చిదంబరం. ఎంత ఆపుకుందామన్నా, ఓ చిరునవ్వు నా ముఖంలో మెరవక తప్పలేదు. అవును మరి, అవసరమొస్తే నవ్వుతూనే గొంతుకోయాలి. పాపం, వీడెందుకింత ముసలాడిలా కన్పిస్తాడు? ఛ. ఛ. బతకటం చేతకాని వాళ్ళు, చూసైనా నేర్చుకోవచ్చునే! అన్నట్టు, రెండో కేసు చూడగానే ముఖం గంటు పెట్టుకున్నాడు—ఏం, తిరకాసు వెయ్యడు గదా! ముందే జాగ్రత్తపడాలి.

కొద్దిగా తలపైకెత్తి సీరియస్‌గా ముఖం పెట్టి గొంతు సర్దుకున్నాను. వ్యాపారం

మరి. జాగ్రత్త చాల అవసరం. మాటలు తూచి తూచి మాట్లాడాలి. "ఆఁ! చూడు చిదంబరం! నీపై నాకెంత నమ్మకముందో, వేరే వివరించ నక్కర్లేదనుకుంటాను. ఫైళ్ళలో విషయాలు చెక్ చెయ్యాల్సి వున్నా, కళ్ళు మూసుకొని సైన్ చేస్తున్నా నంటే దాన్నిబట్టి నువ్వూహించుకోవచ్చు. (కొంపదీసి, వీడేం చాప కిందనీళ్ళు పొయ్యడం లేదు కదా; ఆఁ అంత ధైర్యమెక్కడే డిసిందీ. ఎవడెవడెలాటివాడో, పాలూ, నీళ్ళూ వేరుచేసి పారెయ్యడం మనకి వెన్నతో ఒంటబట్టిన విద్యేగా! ప్చ్! ఐనా, మనుషుల్నంత ఎక్కువగా నమ్మకూడదిక ముందు!) ఈనెలాఖర్న మన కాన్ఫిడెన్షియల్ మీటింగ్‌లో ప్రొమోషన్‌కి నీ పేరుకూడా ప్రొపోజ్ చేద్దామనుకుంటున్నాను. ఏదో పిల్లలున్న వాడివి గదా; ఆ, అన్నట్టు ఓ వారం రోజుల్లో, ఆ సీతారామయ్య కొడుకుని అపాయింట్ చేస్తూ ఆర్డర్స్ రిలీజ్ చేస్తాను. యీలోగా నామకః ఓ అప్లికేషన్ పెట్టించి, కాస్త ఓ కంట కనిపెట్టి ఉండు స్మీ!——" అంటూ భావయుక్తంగా ఓ చిరునవ్వు విసిరాను. నాకు



తెలుసు యీ ఎఱ ఎంత అమోఘంగా పనిచేస్తుందో. దోషాలేవన్నా వుంటే—— యీ అస్త్రంతో కొట్టుకుపోక చస్తాయా?

చచ్చినట్టు రాజమండ్రికి టిక్కెట్టు తెప్పించి బండి కదిలేదాకా, చేతులు నులుముకొంటూ -- 'నమస్తే!' చెప్పాడు. అందుకొని బెడ్‌పై చేరాను. ఇక అక్కడి పనులేవో డైరీ తిరగెయ్యాలి.

## 3

బూట్లు టకటకలాడిస్తూ హాల్లోకి అడుగుపెట్టగానే, అందరమూ లేచి గౌరవ సూచకంగా చేసే నమస్కారాల్ని - విలాసంగా అందుకొంటూ, తన ప్రైవేట్ రూమ్‌లోకి ప్రవేశించడం-యీ ఆఫీసర్‌కి ప్రత్యేకతేమీ లేని మామూలే! ఆ క్షణాల్లో నాగేంద్రరావు పట్ల చిదంబరం చూపే కృత్రిమ భయభక్తులే మా ముఖాల్లోనూ తాండవిస్తాయ్. ఏం చేస్తాం? నాగరికత కదే నిర్వచనమేమో! స్వచ్ఛంద భావాల్ని కప్పిపుచ్చి తేనెలూరేలా సంభాషించగల్గడం, తనలోని లోపాల్ని మచ్చుకైనా తెలీనీకండా ప్రవర్తించగల్గడం నాగరికత అనేమందు ద్వారా బాగుపడ్తు

న్నట్టు భ్రమింపజేస్తున్న రోగాలు. అవి పూర్తిగా మానవు. ఉండుండి-ఒక్కసారి జూలుదులుపుకు లేచి గర్జిస్తాయి. పొంచి వుండి కాటువేస్తాయి. మనిషిని పశువుగా మార్చేది—యీ నాగరికతలోని కృత్రిమ త్వమే ననుకుంటా!

"ట్రింగ్....ట్రింగ్"—భయపడుతూ పరిగెత్తాను లోపలికి. "స్టెనో - యింకా రాలేదా?" ఖాళీ సీటప్పుడే యీయన కంట పడిందీ? ఈయనగారి వెనకాలేగా-సుశీలమ్మ గారు కూడా వచ్చిందీ.

"ఇప్పుడే వచ్చారు బాబూ!" గడగడ వణికింది నా జవాబు.

"అర్జంటూగా పిలుస్తున్నాననిచెప్పు!"- చిన్న సైజు గర్జన!

పరిగెత్తు కెళ్ళి తీసుకొచ్చాను. పాపం, ఆ లేడి కళ్ళలో తొణికే బెదురు చూసైనా, యీ ఆఫీసర్‌గార్కి దయ కలగదా? ఆయ న్నుండి వెలువడ్డ చూపుకి సమాధానంగా వచ్చింది జవాబు.

"సర్! ఆఫీసుకి బయల్దేరే టైమ్‌కి నాన్న రక్తం కక్కుతున్నారు. డాక్టర్ని పిలిచి, కావలసిన మందులు తమ్ముడికిచ్చి,ఆటోలో వచ్చేసరికి, యీ పాపుగంట లేటయింది. ఎక్స్యూజ్ మీ సర్!" — దీనంగా వెలు వడ్తున్న మాటల్ని సపోర్టు చేస్తున్నయ్ కళ్ళల్లోని బాధామయ వీచికలు.

"ఆఫీస్‌కి టైమ్ లోపల అటెండవడం నీ ఫస్ట్ డ్యూటీ. ఇదివరకే వార్నింగ్ యివ్వడం కూడా జరిగింది. ఇకనించీ యీ పద్ధతి వీలుపడదు. ఊఁ, యీ లెటర్స్ తీసుకో!"-కఠినంగా వెలువడ్డాయి ఆఫీసర్ గారి పదాలు.

'ఏడవకండేడవకండి సుశీలా- ఏడుపు రానీకండి. మీరేడవబోతుంటే, నే చూశ్లేను. మీ కష్టం నాకు తెలుసు. నేను మీ స్నేహి తుల లిస్టులో లేను కానీ, మనసున్న ఓ మనిషిని. చెప్పండి. ఈ ఆఫీసర్ని గుండెలు పగిలి ఏడిచేలా (మీ ముందే) దులిపెయ్య మన్నారా! సరే! ఏమండి సార్! ఏమిటీ అన్యాయం? మీకు తెలీదా? తనొక్కతే ఆధారమైన ఆమె యింట్లో, దీర్ఘరోగగ్రస్తు డైన తండ్రిని గురించి మీకు తెలీదా? ఆమె పరిస్థితి నిజమనీ తెలీదా! చెప్పండి సార్. మీ కంటె ఒక్క నిముషము గదసార్ వెనగ్గా వచ్చిందావిడ? మీరు 14 నిమిషా లైతే, ఆవిడ మరో నిమిషం! ఇంతేగద సార్! దీనికంతరాద్ధాంతం చెయ్యడం న్యాయం కాదు సార్!'- అని దెబ్బలాడుదా మనుకున్నాను. నా బి.ఏ. డిగ్రీకి నాకు దక్కిన ఈ ఉద్యోగాని క్కూడా నీళ్లొదులు కుంటే? నా సీత, పిల్లలు?.......ఉండలేక బైటికి వచ్చేశాను.

"టెలిగ్రాం........" పోస్టు మాన్ అందించాడు. గా భ రా గా చించ బోయాను. ఆఫీసర్‌గారిది! ఆయనకేం నిండు కుండలా తీసుకుంటాడు. వీటికి భయపడాల్సింది మనలాటివాళ్ళు గానీ, యీయనకేం, రోజుకెన్నైనా పుచ్చుకో గలడు.

'అఁ! పాపం! ఈసారి కూడా ఆడ పిల్లేనా?' ఐనా, అలా దుక్కలా నవ్వుతా డేం? ఔన్లే, ఆయనకేం? ఎంతమంది ఆడ పిల్లలైతే మటుకేం? పార్టీ గూడా చేస్తా డేమో!'

"మీ మిసెస్ నక్కడికి పంపారేమండి, యిక్కడ మంచి డాక్టర్లుండగా? మేం పాపని చూడ్డానికీ, ప్రెజంటేషన్స్ యివ్వ డానికీ లేదు!........" ప్రేమాభిమానాలు ప్రకటిస్తున్నాడు ఎత్తు పళ్ళ కాకారావు. ఔను, మరి, పార్టీ పుచ్చుకుంటున్నాడుగా.

"ఆ, యిక్కడ పెర్సనల్‌గా అటెం డవడం కుదరదని, అక్కడైతే డాక్టరు హస్తవాసి మంచిదని మా వాళ్ళకో నమ్మకం! కాస్త ఖర్చే! ఐనా, ఏదో పెద్ద వాళ్ళ ముచ్చట కదా....అని...." అర్థో క్తిలో ముగించాడు ఆఫీసర్.

## 4

"నమస్తే సార్!" ఎదురుగా ఓ ఇరవై ఏళ్ళ బ్బాయి భయంభయంగా నిల్చున్నాడు.

ఆయన-రాత్రి భోంచేసి వాలు కుర్చీలో నడుం వాల్చి కాస్త విశ్రాంతి తీసుకుం టూన్న సమయం!

"మేము నాల్గు వీధుల అవతల వుంటున్నాం, సర్. మా నాన్నగారు మొన్ననే పోయారు హఠాత్తుగా. గడవడం చాలా కష్టంగా ఉందండి. మీకు తెలిసిన చోటెక్కడైనా చిన్న ఉద్యోగమిప్పిస్తే.." దీనంగా చూశాడాయన ముఖంలోకి.

"ప్రస్తుతం నా ఆఫీస్‌లో కాళీలేం లేవు బాబూ! ఐనా ప్రయత్నిస్తాను. ఎంతవరకూ చదువుకున్నావ్?"

"పి.యు.సి. చదువుకున్నానండి. పైపు హైయ్యర్ పాసయ్యాను. ఇంట్లో ముగ్గురు పిల్లలున్నారు సార్, నా తర్వాతి వాళ్ళు!..." బావురుమన్నాడా అబ్బాయి. ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. ఆ లేత హృదయంలో ఎంత రంపపు కోత! "ఈసారి తప్పక గుర్తుంచుకుంటాను, ఈలోగా నీ ప్రయ త్నాలు నువ్ చెయ్యి బాబూ!"—— అని సాగనంపాడాయన.

* *

అయ్యో, అదీ సంగతి!

ఉద్యోగం సంఘంలో ఒక వర్గానికెంత చులకనై పోయింది? మరో వర్గాని కెంత గగన కుసుమమైపోయింది?

తన ఆఫీసులో, తన కెంతమందితో అవసరముందో, ఎవర్ని సెలక్టు చేసుకో వాలో....నిర్ణయించుకొనే అధికారం—— ఆఫీసరు చిదంబరానికి లేదు. పైవాళ్ళెవళ్ళ నిస్తే వాళ్ళతో సరిపుచ్చుకోవాలి. తను యిప్పించలేని అసమర్థతని చెప్పుకోలేడు- హృదయం కరిగి నీరవుతున్నా.

సంస్థల మూల పురుషులు వేరు, నడిపే వారు వేరు, లాభాలు తెచ్చేవారు వేరు, పంచుకొనేవారు వేరు.

అవసరాన్నిబట్టి, అర్హతలనిబట్టి—— ఉద్యోగాలిచ్చేరోజులుపోయాయి.

సహజత్వాన్నిబట్టి, సమర్థతనిబట్టి— ఇచ్చేరోజులిక రావు.

మంచిని మానవత్వాన్ని గుర్తించడ మింక జరగదు.

దానవత్వం, అధికారదర్పం చంపు కోడ మిక వీలుకాదు.

మరమనుషులు - మెకానికల్ జీవితాలు! ఎందుకీ ముసుగులు! మబ్బుల నీడలు?

ఇది నాగరికతా? మానవత్వమా?.... చచ్చినా కాదు!

కాదని తెలిసీ మనిషెందుకిలా లొంగి పోతున్నాడు? కుంగిపోతున్నాడు?

బలహీనతవుంటే, వినమ్రతతో తల వంచి—దానిని పోగొట్టుకోడానికి తగ్గ కృషి చెయ్యడేం?

అవడానికి తనో ఆఫీసరు!

—ఇంట్లో బియ్యం నిండుకున్నా యప్పుడే!

అతని హోదా తననే భయపెట్టేంత గొప్పది!

—పిల్లాడికి బూట్లూ, పుస్తకాలూ కొనియ్యాలంటే, ఆ నెల దాటెయ్యాలిమరి!

శ్రీ నాగేంద్రరావుగార్ని టాక్సీలో తీసు కెళ్ళాలి; ఊరికి క్లాసు టిక్కట్టే తెప్పించి యివ్వాలి.

—వచ్చేప్పుడు మాత్రం నడుచు కొంటూ రావాలి ఆఫీసుకి.

—మళ్ళా ఎవరికంటా పడకండా ఉండటానికి కొంచెం లేటుగా గూడా రావాలి.

మనసులో మనిషికి కావలసిన ఆత్మీయత, అనురాగమూ, మంచితనమూ, మానవత్వమూ-అన్నీ ఉన్నాయ్. కాని, ఆఫీసరుగా, వాటి నందరికీ పంచి యివ్వ డానికి వీలులేదు.

—ఇక్కడ డెలివరీ ఐతే అంటుకొనే ఖర్చులు భరించలేక, ఎక్కడికో పంపానని చెప్పకూడదు. పెద్దవాళ్ళ ముచ్చట—అని సర్ది చెప్పాలి. అక్కడ వున్న భూములు పండనివనీ, గడవడానికే యిక్కణ్ణించి— నెలకో రెండొందలు పంపుతూండాలనీ— లోపల అనుకోవాలే గానీ-అనకూడదు.

ఉద్యోగావకాశా లున్నా లేకపోయినా, యిప్పించలేని తన అసమర్థత నొప్పుకో కూడదు, రేపొద్దునో మొద్దు వెధవొచ్చి నెత్తి నెక్క బోతున్నానూ!

పార్టీ చెయ్యాలే గానీ, యిక ఆ నెల ఖర్చుకి మిగిలేది-మరో పార్టీకయ్యే ఖర్చు మాత్రమే నని బయట పడగూడదు సార్!

ఇది హోదా! .. ఇవి ముసుగులు!

ఇవి జ్వలిత సూర్యుని వాడి కిరణాలకు కూడా కరగని మంచు ముద్దలు!

సప్త సముద్రాలెత్తి వచ్చినా మునగని దర్ప శిఖరాలు!

మనిషికీ-మనసుకీ మధ్య దట్టంగా పేరు కుంటూన్న యీ తెరలెప్పుడు చించబడ తాయో! ఈ ముసుగు లెప్పుడు తొలగించ బడతాయో?

———